క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



ఖాదర్‌లింగస్వామి దర్గా

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

ఏపీఆర్‌జేసీకి ఎంపిక



కోసిగి: మండల కేంద్రం కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి పూర్తి చేసిన వినయ్ అనే విద్యార్థి ఏపీఆర్‌జేసీలో ప్రతిభ కనపరిచాడు. ఏపీఆర్‌జేసీ ఎంట్రెన్స్‌లో ఎంపీసీ విభాగంలో అన్నమయ్య జిల్లా గ్యారంపల్లి గురుకుల కళాశాలలో సీటు సాధించాడు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గురుకుల పాఠశాలకు..



పూజ



అభిరామ్

కోసిగి: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఏపీ ఎస్సీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి ఎంపికయ్యారు. హేమశ్రీ పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసిన పూజ అనే విద్యార్థి హేమ తిరుపతి జిల్లా పుత్తూరు గురుకుల స్కూల్‌కు ఎంపికై ంది. చౌడేశ్వరి స్కూల్ విద్యార్థి కోడి అభిరామ్ అన్నమయ్య జిల్లా కొత్తకోట గురుకుల స్కూల్‌లో సీటు సాధించాడు.

హామీలు నెరవేర్చాలి

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సత్వరం అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రతిఘటన వైపీఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు లాంటి హామీలు సత్వరం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు రామాంజినేయులు, వినయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

నందవరం : రేషన్ పంపిణీలో డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు, డీలర్లు పేదల సక్రమంగా రేషన్ అందించాలని సూచించారు. తూకాలలో మోసాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, డీటీ శశిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణం ఆపాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులోని హిందూ శ్మశాన వాటిక స్థలంలో చేపట్టిన 30 అడుగుల రోడ్డు నిర్మాణం ఆపాలని, ఇందు చేసిన మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం రద్దు చేయాలని హిందూ కులసంఘాల నాయకులు బీఎల్ నారాయణ, గణేష్, పాండురంగస్వామి, మాధవస్వామి తదితరులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తాలూకా యాదవ సంఘ కార్యాలయంలో న్యాయవాది నారాయణ అధ్యక్షతన జరిగిన 22 కుల సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. 17వ వార్డు ప్రజల సౌకర్యార్థం శ్మశాన వాటికలో రోడ్డు నిర్మించాలని కౌన్సిల్ తీర్మానం చేయడంతో 30 అడుగుల మేర శ్మశాన వాటిక స్థలం పోతుందన్నారు. శ్మశాన వాటికకు భవిష్యత్‌లో స్థలం తక్కువ అవుతుందన్నారు. అధికారులు ఈసమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు కురుబ బీరప్ప, పూజారి లక్ష్మన్న, వీరేష్, దస్తగిరి, శేఖర్, కన్నయ్య, వడ్డే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న ముందస్తు వర్షాలు

- సాగుకు సన్నద్ధమైన రైతన్నలు
- ప్రస్తుత వర్షాలు పత్తి సాగుకు అనుకూలం
- వేరుశనగ, ఇతర పంటలు ఇప్పుడే వద్దు
- నల్లరేగడిలో 60మి.మీ, ఎర్ర నేలల్లో 35 మి.మీ మించి వర్షం కురిస్తేనే సాగుకు అవకాశం
- ప్రభుత్వం నుంచి అన్నదాతలకు కరువైన సాయం
- లక్ష్యం చేరని భూసార పరీక్షలు



ఆదోని వద్ద ముందస్తు వర్షాలకు విత్తు నాటుతున్న రైతులు, కూలీలు

మంత్రాలయం/ఆదోని రూరల్/ఎమ్మిగనూరు టౌన్: ముందస్తు ఊరిస్తోంది. రైతన్నలను పొలాల వైపు తరుముతోంది. అశల విత్తు, సేద్యపు సాగుతో పంటపొలాలు సందడి చేస్తున్నాయి. ఉల్లినాట్లు, పత్తి విత్తు పెట్టే కూలీలతో పొలాలు కళకళలాడుతున్నాయి. సరైన సమయం కావడంతో రైతన్నలు సైతం ముందస్తు సాగులో మునిగారు. నిరుడి కష్టాల నుంచి గట్టెక్కేందుకు పరితపిస్తున్నారు. రైతులు సందడిలో ఉన్నా కూటమి ప్రభుత్వంలో చలనం కొరవడింది. గిట్టుబాటు ధర లేదు. పంట నష్ట పరిహారం లేదు. అన్నదాత సుఖీభవ లేదు. ఈ ప్రభుత్వం కర్షకులకు జరిగిన మేలు శూన్యం.

పొలంబాటలో రైతులు

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం సాగు భూమి 1,82,115 ఎకరాలు ఉంది. అందులో వర్షాధారం వర్షాధారం కింద 1,20,552 ఎకరాలు కాగా, తుంగభద్ర దిగువ కాలువ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ ప్రాజెక్టు, బోరుబావుల కింద57, 919 ఎకరాలు సాగుభూమి ఉంది. ఇక్కడ ప్రధాన పంటగా పత్తిని సాగు చేస్తున్నారు. వేరుశనగ, వరి రెండవ ప్రధాన పంటలు వస్తున్నాయి. సాగుకోసం కాంప్లెక్స్ 3,600 మెట్రిక్ టన్నులు, యూరియా 4,500 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,700 మె.టన్నులు అవసరం. ముందస్తు వానలు రావడంతో 2,300 ఎకరాల్లో ఇప్పటికే పత్తి విత్తు వేశారు. నియోజకవర్గంలో 13 శాతం వర్షపాతం నమోదైంది. ఇలాగే వానలు కురిస్తే 20 రోజుల్లో పత్తి విత్తు పూర్తయ్యే అవకాశం ఉంది. అంతేగాక బోరుబావుల కింద ఉల్లిసాగు ఊపందుకుంది. నియోజకవర్గంలో 800 ఎకరాల్లో ఉల్లి సాగైంది. నియోజకవర్గంలో రైతులకు సరపడా ఎరువులు అందుబాటులో ఉన్నా రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా సరఫరా చేయలేదు.

అంతంత మాత్రంగా భూసార పరీక్షలు

ఇక భూసార పరీక్షలు కూడా అంతంత మాత్రమే జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పరీక్షల కోసం 5 వేల నమూనాలకుగానూ 2,300 నామూనాలు మాత్రమే సేకరించారు. ఇంకా పరీక్షల వివరాలు రైతులకు చేరాల్సి ఉంది. నకిలీ విత్తనాల విషయంలో దాడులు పూర్తిగా లేకపోయాయి. చాలా మంది రైతులు బయట వ్యక్తులతో కేజీ రూ.వెయ్యి చొప్పున వెచ్చించి లూజ్ పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది డీలర్లు ఎస్టిమేట్ బిల్లులతో రైతులను మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేదు.

ఎమ్మిగనూరు పరిధిలో 3వేల ఎకరాల్లో పత్తి

ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో 1.68 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. అయితే అందులో ముందస్తు వర్షాలతో దాదాపు 3వేల ఎకరాల్లో పత్తిని రైతులు సాగు చేశారు. సబ్‌డివిజన్ పరిధిలోపత్తి, వేరుశనగ,కంది,కొర్ర, సజ్జ, ఉల్లి, మిరప పంటలను రైతులు ఏటా ఖరీఫ్‌లో సాగుచేస్తున్నారు. రైతులు పంటలు సాగు చేసేందుకుగాను మొదట భూసార పరీక్షల మేరకు పంట సాగు, వాడాల్సిన ఎరువుల ఉపయోగం తదితర వాటికై భూసార పరీక్షలు చేయాల్సి వుంది. అయితే ఈ ఖరీఫ్ సీజన్‌లో 25వేల మట్టి నమూనాలు సేకరించాలన్నది లక్ష్యమైతే.. సేకరించింది మాత్రం ఇప్పటి వరకు 4200లు మాత్రమే. వాటి ఫలితాలు రైతులకందాల్సి వుంది.

ఆదోని నియోజకవర్గంలో..

ఆదోని నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన విస్తీర్ణం 30,976 హెక్టార్లు కాగా, ప్రస్తుతం ముందస్తు వర్షాలకు 2,500 ఎకరాలో పత్తి విత్తు జరిగింది. నియోజకవర్గంలో ఇప్పటికే 2,035 మట్టి నమూనా పరీక్షలు చేయాల్సి ఉండగా, 14,052 మంది రైతుల పొలాల్లో మట్టిని సేకరించి పరీక్షించారు. నియోజకవర్గంలో 14,901 మంది రైతులు ఉన్నారు. ఇందులో కౌలు రైతులు 2,500 మంది ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ పీఎం కిసాన్ కింద రూ.2.98 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ ద్వారా ఎలాంటి సాయం అందలేదు. దీంతో రైతులు పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ముందస్తు వర్షాలకు పత్తి విత్తనాలు నాటుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వేరుశనగ, ఇతర పంటలు ఇప్పుడే వేసుకోరాదని సూచిస్తున్నారు.

కరువైన సహకారం

కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు లేకపోయాయి. ఏడాది ముగిసిన అన్నదాత సుఖీభవ రాకపోగా పండించిన పంటలకు గిట్టులేదు. అన్నదాత సుఖీభవ కింద మంత్రాలయం నియోజకవర్గంలో 45,209 మందికి గానూ రూ.90,41, 80, 000 రావాల్సి ఉండగా పైసా విదల్చలేదు. సబ్సిడీ కింద అరకొరగా వేరుశనగ, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు మాత్రమే పంపిణీ చేశారు. ఈ ఏడాది వేరుశనగ 405 టన్నులకు గానూ కేవలం 95 టన్నులకు మించి రాలేదు. రైతులు వేలాది రూపాయలు విత్తు కోసమే ఖర్చు చేసుకోవాల్సి వచ్చింది. ఇక పోయినఏడాది ఏ పంటకూ సరైన గిట్టుబాటు ధర లేదు. పత్తి క్వింటా రూ.7 వేలలోపు ధర పలికింది. మిరప రూ.18 వేలకు మించకపోగా ఆఖర్లో రూ.5 వేలకు క్వింటా మిరప అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతు సేవా కేంద్రాల నుంచి ఏ ఒక్క సహకారం లేకపోయింది.

పరిహారం.. పరిహాసం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023లో కరువు మండలాలను ప్రకటించి బాధిత రైతులను ఆదుకునేందుకు పంటనష్ట పరిహారం మంజూరు చేసింది. అందుకు నిధులు సైతం కేటాయించింది. ఎన్నికలకు వెళ్లడంతో సగం మంది రైతులకు నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాగా తక్కిన రైతులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఆ నిధులకు కన్నం వేసింది. రైతుల ఖాతాల్లో పరిహారాన్ని జమ చేయకుండా చేతులెత్తేసింది. మంత్రాలయం నియోజవర్గంలో దాదాపు మంత్రాలయం మండలంలో 1800 మంది రైతులకుగానూ రూ.2.43 కోట్లు, పెద్దకడబూరులో 460 మందికిగానూ 1.60 కోట్లు, కోసిగిలో 370 మందికిగానూ రూ.39.02 లక్షలు, పెండింగ్‌లో పెట్టింది. అంతేకాదు నిరుడు కరువు మండలాలను ప్రకటించిన కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ రైతులకు వేయలేదు. నియోజకవర్గంలో పెద్దకడబూరు, కౌతాళం మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకున్నారు. కౌతాళం మండలంలో 17,580 మందికిగానూ రూ.16 కోట్లు, పెద్దకడబూరు మండలంలో 9,560 మందికిగానూ రూ.8.30 కోట్లు మంజూరు చేయాల్సి ఉంది.

60- 70 మిల్లీమీటర్ల వర్షపాతం విత్తుకు అనుకూలం

ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి భూముల్లో 60 నుండి 70 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైతే రైతులు విత్తనం వేసుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఎర్ర నేలల్లో 35నుండి 45 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే పంటలను సాగు చేసుకోవచ్చు. ఈ వర్షపాతానికి పత్తి, కంది, కొర్రలు సాగు చేసుకునే అవకాశం వుంది. నల్లరేగడి, ఎర్ర నేలల్లో పత్తి,కంది, వేరుశనగ పంటలు వేసుకోవచ్చు. వాటికోసం డీఏపీ, యూరియా లాంటి ఏమందులైనా ఉపయోగించవచ్చు. పత్తిలో బీటీ 2 రకం పత్తి విత్తనాలు అధీకృత డీలర్ల వద్ద సిద్ధంగా వున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా రైతులు కంది పంట సాగుకు గాను పీఆర్‌జీ 176 రకం, ఐసీపీఎల్ 85063 రకాలు, వేరుశనగలో విశిష్ట రకం సాగు చేయవచ్చు.

అప్పు చేసి విత్తనాలు కొనుగోలు చేశా



నాకు 2.30 ఎకరాలు పొలం ఉంది. ముందస్తు వర్షాలు కురవడంతో పత్తి విత్తనాలను కొనుగోలు చేసి నాటుకుంటున్నాను. గత ప్రభుత్వంలో ఇప్పటికే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందేది. ప్రస్తుత ప్రభుత్వం అన్నదాన సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తుంది ఎదురు చూశా. ఫలితంలేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులతో అప్పు చేసి విత్తనం నాటుకుంటున్నాను.

– అప్పుల మహాదేవ్, రైతు, పెద్దతుంబళం గ్రామం

లైసెన్స్‌లున్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి



లైసెన్స్‌లున్న దుకాణాలోనే రైతులు విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేసి వాటికి సంబంధించిన రసీదులను కచ్చితంగా తీసుకోవాలి. రైతులకు పంటల సాగుకు సూచనలు ఇచ్చేందుకు గాను సబ్ డివిజన్ పరిధిలో తనతో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ, సచివాలయాల అగ్రికల్చర్ సిబ్బంది అందుబాటులో వుంటారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తే నష్టాల బారిన పడకుండా వుండొచ్చు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ఇప్పటికే 48 విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశాం. వాటి నాణ్యతను నిర్ధారించేందుకు ల్యాబ్‌కు పంపించడం జరిగింది.

– మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ,ఎమ్మిగనూరు

కచ్చితంగా క్యాష్ బిల్లులు తీసుకోవాలి



రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా క్యాష్ బిల్లులు తీసుకోవాలి. ముఖ్యంగా విత్తనాలు కొనుగోలు సమయంలో లాట్ నంబర్లు, క్యాష్ బిల్లులు తీసుకోవాలి. నాసిరకం విత్తనాలతో నష్టపోతే కంపెనీలతో పరిహారం పొందే అవకాశం ఉంటుంది. ఇక బయట డీలర్లతో ఎటువంటి పరిస్థితుల్లో లూజు విత్తనాలు కొనుగోలు చేయరాదు. వానలు పుష్కలంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంటోంది. జూన్ రెండో వారంలోగా విత్తనాలు వేసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఉంటాయి.

– జీరా గణేష్, వ్యవసాయాధికారి

ఎర్ర నేలల్లో పత్తి వేసుకోవచ్చు



ప్రస్తుతం ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఎర్ర నేలల్లో పత్తి విత్తనాలు వేసుకోవచ్చు. మేలు రకమైన విత్తనాలు నాటుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు లూజు విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలు కొన్న చోట రసీదు పొందాలి. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. వేరుశనగ, కంది పంటలను ప్రస్తుత వర్షాలకు సాగు చేసుకోవద్దు. బెట్ట వస్తే పత్తి మాత్రమే తట్టుకోగలదు.

– అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఓ, ఆదోని

బస్టాండు పరిసరాల్లో శుభ్రతకు చర్యలు తీసుకోండి



ఆర్టీసీ సిబ్బందికి సూచనలు తెలియజేస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



దుద్ది గ్రామంలో రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై గురువారం ఉదయం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండులో మౌలిక సదుపాయాలు, పార్కింగ్, హోటళ్ల పరిస్థితులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. బస్టాండు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు తాగు నీటి వసతి మెరుగుపరచాలని, టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని డిపో మేనేజర్‌ను ఆదేశించారు. బస్‌స్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయడం గమనించిన సబ్‌కలెక్టర్ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రయాణికులతో మాట్లాడి బస్సుల సమయపాలన, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. టాయిలెట్ల పరిశుభ్రత విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్‌కు సూచించారు. అంతేగాక బస్టాండు ఎంట్రెన్స్ మరియు ఎగ్జిట్ వద్ద రోడ్డు పరిస్థితిని పరిశీలించి సబ్‌కలెక్టర్ రోడ్డు మరమ్మతు చేయించాలని ఆదేశించారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కోసిగి: భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు ఆదేశించారు. గురువారం కోసిగి మండలంలోని దుద్ది గ్రామంలో జరుగుతున్న రీసర్వేను తహసీల్దార్ రుద్రగౌడ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్యలతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో సమావేశమయ్యారు. రీ సర్వే ప్రక్రియలో వచ్చిన సమస్యలు, వివిధ అంశాలపై ఆరా తీశారు. రీ సర్వే చేసే భూములకు సంబంధించిన విషయాన్ని ముందుగా పొలాల రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి సమక్షంలో రీ సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ తిక్కస్వామి, వీఆర్వోలు, రెవెన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి

గోనెగండ్ల : సాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రం గోనెగండ్లలో రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయాన్ని వ్యాపార కోణం చేసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని, అలాగే సేంద్రియ ఎరువులు పెట్టి పెట్టుబడులు తగ్గించుకోవాలని సూచించారు. పంటలకు ఎంతమోతాదులో ఎరువులు వాడాలో తెలుసుకొని ఉండాలన్నారు. ఇష్టం వచ్చినట్లు రసాయన ఎరువులు వాడితే పంట దిగుబడి తగ్గి రైతుకు నష్టం వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, డీఆర్‌సీ ఏడీఏ గిరీష్, డీఆర్‌సీ ఏఓ శశిధర్, బనవాసి కోఆర్డినేటర్ రాఘవేంద్ర, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల ఇళ్ల స్థలాలనున ఇచ్చే వరకుపోరాటం చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్, మండల సహాయ కార్యదర్శి రాజీవ్ అన్నారు.జూన్ 2వ తేదీన ఇళ్ల స్థలాలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమ పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కేసీ జబ్బార్, దాదావలి, ఈరమ్మ, చామంతి తదితరులు పాల్గొన్నారు.

- **నందవరం** : మండల కేంద్రం నందవరంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ జూన్ 2న మండల కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దేవరాజ్, మల్లేష్, నబిసాబ్, చెన్నప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించే వరకు పోరాటం

ఆదోని రూరల్: పట్టణ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న శ్రీసాయినగర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించే వరకూ పోరాటం ఆగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్ అన్నారు. గురువారం విద్యుత్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి, విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ వాటికి విద్యుత్ తీగలను ఏర్పాటు చేయకుండా కాలనీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లు అయినప్పటికీ విద్యుత్ సౌకర్యం, రాత్రి సమయంలో వీధి దీపాలు లేకపోవడం బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు విజయ్, బేల్దారి రాముడు, రమేష్‌కుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు మంజూరు చేయాలని వినతి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు ఇవ్వాలని కోరుతూ గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందించారు. మే నెల ముగిసిపోతున్నా నేటికీ జీతాలు అందకపోతే తాము ఇంటి అద్దెలు, నిత్యావసరాలను కొనుగోలు చేయడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎఫ్ఎంఎస్‌లో ఏర్పడిన సాంకేతిక కారణంగా వేతనాలు ఆలస్యమయ్యాయని, త్వరలోనే విడుదలవుతాయని కమిషనర్ తెలిపారు.

రాయితీ విత్తనాల మంజూరు

పెద్దకడబూరు : మండలానికి రాయితీ వేరుశనగ విత్తనాలతో పాటు కందులు, కొర్రలు, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు మంజూరు అయ్యాయని ఏఓ ఎం.వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి 230 క్వింటాళ్ల వేరుశనగ, కందులు 50క్వింటాళ్లు, కొర్రలు 2క్వింటాళ్లు, జీలుగ 12క్వింటాళ్లు, పిల్లిపెసర క్వింటా విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

నందవరం : యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మాస్టర్ ఆఫ్ ట్రైనర్ల ఆధ్వర్యంలో మండల అధికారులు, సిబ్బంది యోగా శిక్షణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమూర్తి, డీప్యూటీ ఎంపీడీఓ సందీప్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే అక్రమ అడ్మిషన్లు చేసుకుంటూ పుస్తకాలు, ఫీజుల కోసం వేలాది రూపాయాలను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని నారాయణ పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు విష్ణు, సమీర్, దస్తగిరి, హాజీ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతుకు లాభాలు



మాట్లాడుతున్న డీపీడీ కే.శ్రీలత

పెద్దకడబూరు : భూసార పరీక్షలు చేయించుకోవడం వలన రైతులకు అనేక లాభాలు ఉన్నాయని డీపీడీ ఆత్మా (కర్నూలు) కే.శ్రీలత, వ్యవసాయ పరిశోధన స్థానం (నంద్యాల) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తల బృందం మండల పరిధిలోని తారాపురం, పెద్దకడబూరు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పర్యటించింది. ఖరీఫ్ పంటల సాగులో పాటించవలసిన సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాలు, మట్టి పరీక్షల ఆధారంగా పంటల ఎంపిక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు తదితర విలువైన సమాచారంపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం మండలంలో వచ్చేనెల 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మిరప, పత్తి, కంది తదితర పంటలలో రైతులు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్తలు చందన, మౌనిక, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎనుములు మృతి



జాలవాడి గ్రామంలో విద్యుదాఘాతానికి బలైన ఎనుములు

పెద్దకడబూరు : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రెండు ఎనుములు బలి అయ్యాయి. దాదాపు రూ. 1.20లక్షలు నష్టం వాటిల్లడంతో బాధితుడు శరణప్ప లబోదిబో అంటున్నాడు. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో తాగునీటి బోరు కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఉన్న కొంతమంది రైతులు విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బాధితుడు శరణప్ప కుమారుడు గురువారం సాయంత్రం ఎనుములను మేతకు ఆ పొలం గుండా తీసుకెళ్లాడు. అక్రమంగా తీసుకున్న సర్వీసు వైరుకు అతుకులు ఉండంటతో మేత మేసుకుంటూ వెళ్లిన ఎనుములు విద్యుదాఘాతానికి గురై రెండు అక్కడికక్కడే చనిపోయాయి. ఆ రైతు రెండు ఎనుములు కడుపుతో ఉన్నాయని త్వరలోనే అవి ఈనేవని, పాలు అమ్ముకొని తమ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఇలాంటి సమయంలో ఇలా జరిగిందని వాపోయాడు. విద్యుత్ అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డిని వివరణ కోరగా మండలంలో జరిగే ప్రతి విషయం నాకు తెలీదని, ఈ విషయం లైన్‌మెన్ తెలుసుకోవాలని నిర్లక్షపు సమాధానంతో దాటవేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి



మహానందరెడ్డి (ఫైల్)

ఆదోని రూరల్: సీపీఎం సీనియర్ నాయకులు మహానందరెడ్డి (65) గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే సీపీఎం పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలియజేశారు. 40 సంవత్సరాల పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన మహానందరెడ్డి అకాల మరణం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.ఎస్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమా

మంత్రాలయం రూరల్ : మండలంలోని కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమా తనిఖీ చేశారు. గురువారం ఆమె ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎన్‌హెచ్ఎం కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో జరిగే ప్రతి సేవను ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. ఈ కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నారులు, ఓపీ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కచ్చితంగా జరగాలని వైద్యులకు సూచించారు. ఓపీ శాతాన్ని మరింతగా పెంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కోవిడ్ పరీక్షల విషయంలోనూ ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలన్నారు. ఆమెతోపాటు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ భావన, డాక్టర్ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.